సాక్షి
కుమురం భీం

బుధవారం, 21, జూన్, 2023



ఆరోగ్య 'యోగ'ం

నేడు ప్రపంచ దేశాల్లో యోగా విస్తరించింది. ఆరోగ్య రక్షణకు ప్రతిఒక్కరూ దీనిపై ఆధార పడుతున్నారు. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కథనం. 8లో▸



ఎమ్మెల్యేకు వినతి

కౌటాల: ప్రభుత్వ జూనియర్ కళాశాలల వృత్తివిద్య కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని మంగళవారం కౌటాలలో ఎమ్మెల్యే కోనప్పకు వినతిపత్రం అందించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.4 /28.6

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. వేడి, ఉక్కపోత కొనసాగుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి కాస్త చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు కాగజ్‌నగర్‌లో కేంద్ర మంత్రి పర్యటన



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్‌లోని త్రిశూల్ పహాడ్‌పై గల ఏకలవ్య కేంద్రీయ విద్యాలయాన్ని ఈ నెల 22న కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల సందర్శిస్తారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్ బాబు తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాల సందర్శన అనంతరం సమాజంలో ప్రభావశీలులు, విద్యావంతులు, సోషల్ మీడియా, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో సమావేశమవుతారని వెల్లడించారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర మంత్రి పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షుడు విశ్వేశ్వర్‌రావు, నాయకులు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

25న డీడీఎన్ అర్చకుల సమావేశం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయ ఆవరణలో ఈ నెల 25న ఉదయం 8 గంటలకు దూపదీప నైవేద్యం (డీడీఎన్) అర్చకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగు సత్యనారాయణశర్మ, ఉపాధ్యక్షుడు ఒజ్జల శిరీష్‌శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అనంతరం డీడీఎన్ అర్చకుల నిర్ణయం మేరకు జిల్లా నూతన కమిటీని ఎన్నుకుంటామని పేర్కొన్నారు.

బడి వేళలు మార్చాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో బడి వేళలు మార్చాలని యూటీఎఫ్ నాయకులు జిల్లా కేంద్రంలో మంగళవారం అదనపు కలెక్టర్ రాజేశంకు వినతిపత్రం అందించారు. నాయకులు ఇందురావు, హేమంత్, ఊశన్న ఉన్నారు.


ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్

తిర్యాణి(ఆసిఫాబాద్): భూగర్భ జలాల పరిరక్షణకు ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మించేందుకు ఉపాధిహామీ సిబ్బంది చర్యలు చేపట్టాలని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. మండలంలోని గంభీరావుపేట గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ హరితహారం కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. అర్హత కలిగిన మహిళా సంఘాలకు రుణాలు అందించాలన్నారు. అలాగే రుణ బకాయిలు సకాలంలో వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సదానందం, ఈజీఎస్ టీఏ సాగర్, సర్పంచ్ వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

సూర్య ప్రతాపం!





కౌటాల మండలం గుడ్లబోరి గ్రామానికి చెందిన గుండ్ల శ్యాంరావ్, యశోద దంపతుల పెద్ద కుమారుడు గుండ్ల తిరుపతి(32)కి ఇటీవల మంచిర్యాల జిల్లా భీమినికి చెందిన యువతితో పెళ్లి నిశ్చయమైంది. పెళ్లి పనుల కోసం వారం రోజులపాటు ఎండలో తిరగడంతో తిరుపతి వడదెబ్బ బారిన పడి అస్వస్థతకు గురయ్యాడు. ఈ నెల 14న మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.



సిర్పూర్(టి) మండలం చీలపెల్లి గ్రామానికి చెందిన లెండుగూరే సోమయ్య, తానుబాయి దంపతుల కుమార్తె మహేశ్వరి(8) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. ఈ నెల 12, 13 తేదీల్లో బడికి వెళ్లి వచ్చింది. అస్వస్థతకు గురికావడంతో బుధవారం బడికి పోలేదు. 15న వాంతులు, విరోచనాలు కావడంతో సిర్పూర్(టి) సామాజిక ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వడదెబ్బ బారిన పడిందని మందులు ఇచ్చి పంపించారు. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఈ నెల 17న మంచిర్యాలకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

- జూన్‌లోనూ తగ్గుముఖం పట్టని ఎండలు
- వడగాలులతో జనం ఉక్కిరిబిక్కిరి
- వారం వ్యవధిలో వడదెబ్బతో ఇద్దరు మృతి
- తొలకరి వర్షాలు లేక ముందుకు సాగని సాగు

కౌటాల(సిర్పూర్): జూన్ ప్రారంభమై 20 రోజులు గడిచాయి. మృగశిర కార్తె వచ్చినా ఇంకా తొలకరి పలకరించలేదు. తీవ్రమైన ఎండకు తోడుగా వడగాలులు వీస్తుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లా నిప్పుల గుండంగా మారి పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ దాటుతున్నాయి. జిల్లాలో వారం రోజుల వ్యవధిలో వడదెబ్బతో ఇద్దరు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది.

జూన్‌లోనూ హీట్

కాగజ్‌నగర్ మండలంలోని జంబుగాతోపాటు చింతలమానెపల్లి, కెరమెరి, దహెగాం మండలాల్లో తీవ్రమైన వేడి ఉంటుంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌కు చేరువగా నమోదవుతున్నాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం 30 డిగ్రీలకు తగ్గకపోవడంతో రాత్రిపూట సైతం ఉక్కపోత ఉంటోంది. ఫలితంగా ప్రజలు అల్లాడుతున్నారు. మరో వైపు పాఠశాలలు ప్రారంభమయ్యాయి. దీంతో విద్యార్థులు ఉక్కపోతతోనే బడుల్లో గడుపుతున్నారు. ఉపాధి పనులతోపాటు వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంది. వేసవి వేడి పెరగడం శ్రమజీవులకు గుదిబండగా మారింది. రోడ్ల వెంబడి చిరు వ్యాపారం చేసుకునే వారు వడగాలులతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. రుతుపవనాలు వచ్చే వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉండటంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దాహం వేయకున్న శరీరానికి తగినన్ని నీళ్లు తాగాలంటున్నారు. అలాగే అత్యవసరం అయితే తప్పా ఇంటి నుంచి బయటికి రావొద్దని హెచ్చరిస్తున్నారు.

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్)

తేదీ	ప్రాంతం	ఉష్ణోగ్రతలు
15	జంబుగా	44.2
16	జంబుగా	45
17	జంబుగా	44.4
18	జంబుగా	44.5
19	జంబుగా	43.6
20	కెరమెరి	44.4

అదను దాటుతోంది..

మరో వైపు తొలకరి వర్షాలు లేకపోవడంతో సాగు పనులు ముందుకు సాగడం లేదు. కొంత మంది రైతులు ధైర్యం చేసి పొడి దుక్కుల్లోనే విత్తనాలు విత్తుకుంటున్నారు. పత్తి సాగుకు అదను దాటి పోతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు పడి చెరువులు, కుంటల్లోకి వరద వచ్చేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో ఈ ఏడాది కూడా వానాకాలం, యాసంగి సాగు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

నిర్లక్ష్యం చేయొద్దు



చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రతలు పెరగడం, వణుకు పుట్టడం, వాంతులు కావడం, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితికి రావడం వడదెబ్బ లక్షణాలు. వడదెబ్బ తగలకుండా ఉండాలంటే తీవ్ర ఉష్ణోగ్రతలు ఉండే సమయంలో ఎక్కువగా ఎండలో తిరగొద్దు. రోడ్ల వెంట విక్రయించే రంగు పానీయాలు, కలుషిత ఆహారానికి దూరంగా ఉండి నీళ్లు, పళ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని వీలైనంత త్వరగా చల్లని గాలితగిలే ప్రదేశానికి చేర్చాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు ద్రావణం లేదా ఓఆర్ఎస్ తాగించాలి. నిర్లక్ష్యం చేయకుండా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

– రామకృష్ణ, డీఎంహెచ్‌వో

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి



డిజిటల్ తరగతులు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, తదితరులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. విద్యాదినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి డిజిటల్ తరగతులను ప్రారంభించారు. అనంతరం 'మన ఊరు– మన బడి'లో భాగంగా అభివృద్ధి చేసిన చోర్‌పల్లి (నందుప) పాఠశాలను ప్రారంభించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాంతోపాటు నాణ్యమైన భోజనం అందుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్ సింగిల్ విండో చైర్మన్ అలిబిన్, ఎస్‌వోలు భరత్, సుభాశ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

'గోవుల అక్రమ రవాణా అడ్డుకోవాలి'



డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లాలో గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని బీజేపీ, బజరంగ్ దళ్ నాయకులు కోరారు. చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలో డీఎస్పీ కరుణాకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు, బజరంగ్ దళ్ నాయకులు పాల్గొన్నారు.

సరిహద్దు భద్రతపై దృష్టి సారించాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్
- మహారాష్ట్రలో చంద్రపూర్ ఎస్పీ రవీంద్రసింగ్‌తో భేటీ



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్, పక్కన చంద్రపూర్ ఎస్పీ రవీంద్రసింగ్

ఆసిఫాబాద్: తెలంగాణ– మహారాష్ట్ర సరిహద్దు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. తెలంగాణలో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సరిహద్దు భద్రతపై చంద్రపూర్ ఎస్పీ రవీంద్రసింగ్ పరదేశీతో మంగళవారం డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్‌తో కలిసి చంద్రపూర్ ఎస్పీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఎస్పీ సురేశ్ కుమార్ మాట్లాడుతూ సరిహద్దుల ద్వారా అక్రమాల నియంత్రణపై చర్చించారు. సరిహద్దు భద్రత చర్యలు పటిష్టంగా ఉండాలని, చోరీలకు సంబంధించిన కేసులు, ఇతరత్రా నేరాలు చేసే ముఠాలను పట్టుకోవడం, ఇతర కేసులను పరిష్కరించుకోవడంలో పరస్పరం సహకరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ సుధాకర్, వాంకిడి, కౌటాల సీఐలు శ్రీనివాస్, సాదిక్‌పాషా, చంద్రపూర్ జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

ఆసిఫాబాద్‌అర్బన్: అంకితభావంతో పనిచేస్తే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా నుంచి బదిలీపై వెళ్తున్న ఏవో భక్త ప్రహ్లాద్, పీపీఎస్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లాఖాన్‌ను మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటివరకు విధుల్లో చూపిన నిబద్ధతతో భవిష్యత్తులో పనిచేయాలని సూచించారు. ఉద్యోగంతోపాటు కుటుంబానికి సమయం కేటాయించాలన్నారు. క్రమశిక్షణతో మెలగాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు సుధాకర్, రాణాప్రతాప్, వపన్‌కుమార్, రమేశ్, ఆర్‌ఐలు భరత్ భూషణ్, శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ధరలు పైపైకి..



జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్

- భగ్గుమంటున్న కూరగాయల రేట్లు
- జిల్లా అవసరాలకు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి
- బహిరంగ మార్కెట్‌లో చుక్కలనంటుతున్న వైనం
- అదే దారిలో మాంసం ధరలు

ఆసిఫాబాద్: జిల్లాలో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. మొన్నటి వరకు సామాన్యులకు అందుబాటులో ఉన్న కూరగాయలు ఎండలతోపాటే భగ్గుమంటున్నాయి. నెల క్రితంతో పోల్చితే ధరలు అమాంతం రెట్టింపయ్యాయి. గత నెలలో రూ.పదికి కిలో ఉన్న టమాట మంగళవారం రూ.60కి చేరగా, పచ్చిమిర్చి కిలో రూ.40 నుంచి రూ.120కి పెరిగింది. ఆరుగాలం కష్టపడి పండించిన గిట్టుబాటు ధర లభించక రైతులు అప్పుల పాలవుతుంటే.. మరోవైపు లక్షల మంది వినియోగదారులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. రైతు నుంచి వ్యాపారులు కొనుగోలు చేసే రేటుకు.. బహిరంగ మార్కెట్‌లో విక్రయించే రేటుకు కిలోకు ఏకంగా రూ.25 నుంచి రూ.35 వరకు వ్యత్యాసం కనిపిస్తోంది.

తగ్గుతున్న సాగు..

జిల్లాలో ఏటేటా కూరగాయల సాగు తగ్గుతోంది. స్థానిక రైతులు పత్తి, కంది వంటి వాణిజ్య పంటలకే మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో సుమారు 6.5 లక్షల జనాభా ఉండగా, 1.17 లక్షల మంది రైతులు ఉన్నారు. గతేడాది వానాకాలం సీజన్‌లో 2,045 ఎకరాలు, యాసంగి సీజన్‌లో కేవలం 156 ఎకరాల్లో కూరగాయలు సాగు చేశారు. ప్రాజెక్టులు ఉన్నా ఆయకట్టు రైతులకు సాగు నీరందక ఏటా ఆరుతడి పంటలే సాగు చేస్తున్నారు. జిల్లాలో జనాభాకు సరిపడా కూరగాయలు సాగు లేకపోవడంతో ఏటా వేసవిలో కూరగాయల రేట్లు పెరిగిపోతున్నాయి. జిల్లా అవసరాల కోసం పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మదనపల్లి నుంచి టమాట, మధ్య ప్రదేశ్ నుంచి పచ్చిమిర్చి దిగుమతి అవుతోంది. స్థానికంగా కూరగాయల సాగు తగ్గడం, డిమాండ్‌కు సరిపడా దిగుబడి లేకపోవడంతో వ్యాపారులు దీన్ని అనుకూలంగా మార్చుకుంటున్నారు.

పెరిగిన మాంసం.. కోడిగుడ్డు రేట్లు

కూరగాయల ధరల దారిలోనే మటన్, చికెన్, కోడిగుడ్డు ధరలు భారీస్థాయిలో పెరిగాయి. 15 రోజుల క్రితం కిలో రూ.240 ఉన్న చికెన్ ప్రస్తుతం రూ.300కి అమ్ముతున్నారు. ఒక్కో కోడిగుడ్డు రూ.7కు విక్రయిస్తున్నారు. కిలో మటన్ రూ.700 అమ్ముతుండగా, గొర్రె మాంసానికి కూడా అదే ధర ఉంటోంది. మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో అనారోగ్యం బారిన మేకలు, గొర్రెల మాంసాన్ని వినియోగదారులకు అంటగడుతున్నారు.

చేతులు మారే క్రమంలో..

రైతు నుంచి మార్కెట్‌కు వచ్చే క్రమంలో కూరగాయలు రెండు, మూడుసార్లు చేతులు మారుతున్నాయి. ఒక్కో వ్యాపారి తమ లాభాలను ఖాతాలో వేసుకోవడంతో వినియోగదారులను చేరేసరికి ధరలు ఆకాశనంటుతున్నాయి. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే రైతు బజార్‌లో ధరలు కొంత మేరకు ప్రజలకు అందుబాటులో ఉంటాయి. కానీ ఇప్పటివరకు జిల్లాలో రైతు బజార్లు ఏర్పాటు చేయకపోవడం ప్రజల పాలిట శాపంగా, దళారులకు వరంగా మారింది. జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో 90 శాతం దళారులే రిటైల్‌గా కూరగాయలు విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో హోల్‌సేల్‌గా కొనుగోలు చేసిన చిరువ్యాపారులు ఇష్టానుసారంగా అమ్ముతున్నారు. కూరగాయల వ్యాపారంపై మార్కెటింగ్ శాఖ అధికారుల నియంత్రణ చర్యలు లేకపోవడంతో రేట్లు మండిపోతున్నాయి. వినియోగదారులపై తీవ్ర భారం పడుతోంది. పెరిగిన కూరగాయల ధరలతో సగటున కుటుంబంపై నెలకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు అదనపు భారం పడుతోంది.

జిల్లా కేంద్రంలో ధరలు (రూ.లలో)

టమాట	60	చిక్కుడు	80
పచ్చిమిర్చి	120	దిల్‌పసంద్	80
దొండకాయ	100	అల్చంత	60
బీరకాయ	60	కాకరకాయ	80
వంకాయ	40	దోసకాయ	60
క్యారెట్	120	గోబి	40
కాలీఫ్లవర్	120	ఆలుగడ్డ	30
బెండకాయ	60	ఉల్లిగడ్డ	25
సోరకాయ	60	ఎల్లిగడ్డ	60

ధరలు నియంత్రించాలి



కూరగాయల ధరలు అమాంతం పెరిగాయి. సామాన్యులు, మధ్య తరగతి ప్రజలకు రేట్లు భారంగా మారాయి. ధరలు చూస్తుంటే మార్కెట్‌కు వెళ్లడానికే భయంగా ఉంది. ప్రభుత్వం ధరల నియంత్రణపై దృష్టి సారించాలి.

– శంకరమ్మ, గృహిణి, ఆసిఫాబాద్

సరిపెట్టుకుంటున్నాం



కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెరిగిన ధరలతో కిలో కొనేవాళ్లం పావుకిలోతో సరిపెట్టుకుంటున్నాం. పెరిగిన ధరలు.. మా లాంటి పేదలకు ఇబ్బందిగా మారాయి. పెంచిన కూరగాయల ధరలు తగ్గించాలి.

– అక్కుబాయి, గృహిణి, ఆసిఫాబాద్

అత్యున్నత సమాజాన్ని నిర్మించాలి



రంగయ్యను సన్మానిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, తదితరులు



ప్రధానోపాధ్యాయులకు ట్యాబ్‌లు అందజేత



చారిగాం విద్యార్థుల ప్రదర్శన

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఘనంగా విద్యా దినోత్సవం
- హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు, డీఈవో అశోక్
- ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

ఆసిఫాబాద్‌రూరల్: విజ్ఞానాన్ని పంచి అత్యున్నత సమాజాన్ని నిర్మించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో మంగళవారం డీఈవో అశోక్ ఆధ్వర్యంలో విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యే సక్కుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు రంగయ్యతోపాటు పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎంతో ఉన్నతమైన స్థానంలో ఉన్నారని, వెనుకబడిన ప్రాంతాల్లో నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలిచినప్పుడు టీచర్లకు ఎనలేని సంతోషం కలుగుతుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులను విజ్ఞానవంతులు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. జిల్లా నుంచి రంగయ్య జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం ఎంతో గర్వకారణమన్నారు. మన ఊరు– మన బడి కార్యక్రమం ద్వారా సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే సక్కు పేర్కొన్నారు. డీఈవో అశోక్ మాట్లాడుతూ కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్య అందుతోందన్నారు. సమగ్ర నివేదికల నమోదు కోసం జిల్లాలోని 586 స్కూళ్లకు ట్యాబ్‌లు అందించినట్లు తెలిపారు. డీటీడీవో మణెమ్మ, బీసీ సంక్షేమ అధికారి సత్యనారాయణరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సజీవన్, ఉమ్మడి జిల్లా గురుకులాల ఆర్సీవోలు గంగాధర్, స్వరూపారాణి, జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్



సిర్పూర్(యూ)లో మాట్లాడుతున్న విశ్వప్రసాద్

నార్నూర్(ఆసిఫాబాద్): పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. సిర్పూర్(యూ) మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ పునర్ నిర్మాణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల గుండా పార్టీ కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై గెలిచిన ఎమ్మెల్యే ఆత్రం సక్కు బీఆర్ఎస్‌లో చేరి కాంగ్రెస్‌కు మోసం చేశారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి సరస్వతి, బ్లాక్ కాంగ్రెస్ మెంబర్ అయ్యూబ్ ఖాన్, మండల అధ్యక్షుడు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

26 వరకు సింగరేణి, రామగిరి రైళ్లు రద్దు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్, బల్లార్ష రైల్వేస్టేషన్ల మధ్య నడిచే సింగరేణి, రామగిరి ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 26 వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మూడో రైల్వేలైన్ పనుల నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్, ఇంటర్ సిటీ రైళ్లు యథావిధిగా నడుస్తాయన్నారు.

రైలుకిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

సిర్పూర్(టి): సిర్పూర్(టి)–మాకిడి రైల్వేస్టేషన్‌ల మధ్య హుడ్కిలి గ్రామ సమీపంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా మంచిర్యాల వైపు నుంచి బల్లార్షా వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు కిందపడి మృతి చెందాడు. మృతుని వయస్సు 40 నుండి 45 సంవత్సరాల మధ్య ఉంటుందని, అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, గోధుమరంగు షర్టు, నీలంరంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు.

వైన్‌షాప్ సీజ్

దహెగాం(సిర్పూర్): మండల కేంద్రం లోని శ్రీ చక్రి వైన్‌షాప్‌ను మంగళవారం ఎక్సైజ్ సీఐ విలాస్ కుమార్ సీజ్ చేశారు. మద్యం బాటిళ్లలో నీళ్లు కలిపి విక్రయిస్తుండగా సోమవారం టాస్క్‌ఫోర్స్ అధికారుల సోదాల్లో దొరికిన విషయం తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు షాప్‌ను సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. సీజ్ చేసిన వారిలో ఎక్సైజ్ ఎస్సై ఆర్.కిషన్, హెడ్‌కానిస్టేబుల్ కే.లింగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సంజయ్‌కుమార్ అరెస్టు సరికాదు

- టీఎస్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణిరాం సింగ్



సంజయ్‌ని అరెస్టు చేస్తున్న పోలీసులు

కాసిపేట(బెల్లంపల్లి): కేకే–5 భూగర్భ గని విస్తరణలో భాగంగా మంగళవారం మందమర్రిలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో సమస్యలపై మాట్లాడేందుకు వచ్చిన టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు సంజయ్‌కుమార్, నాయకుడు వాసాల సంపత్‌లను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని టీఎస్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణిరామ్‌సింగ్ అన్నారు. గని విస్తరణ పేరుతో ఓపెన్‌కాస్టు చేస్తూ శ్రావణ్‌పల్లి చుట్టు పక్కల గ్రామాల ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. సమావేశంలో ఎస్‌సీఎల్‌యూ ఉపాధ్యక్షుడు గద్దెల నారాయణ, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు ఎండీ ఆజాం, తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య 'యోగ'ం

జూన్ 21 ప్రత్యేకత..

ఏటా జూన్ 21న సూర్యుడు భూమధ్య రేఖకు దూరంగా వెళ్తాడు. ఆ రోజు సమయం కొద్దిగా ఎక్కువగా ఉంటుంది. ఇదే రోజును ప్రపంచ యోగా దినోత్సవంగా నిర్ణయించడానికి ఇది ఒక కారణంగా చెప్తారు.



మంచిర్యాలటౌన్: దైనందిన జీవితంలో నిత్యం ప్రజలు ఏదో ఒక శారీరక సమస్యతో బాధపడుతున్నారు. ఉరుకులు, పరుగుల జీవితం, తీసుకునే ఆహారంలో పోషక విలువలు లోపించడం వలన అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. కరోనా వంటి విపత్తుల నుంచి రక్షించుకునేందుకు ఏకైక మార్గం మన రోగ నిరోధకశక్తిని పెంపొందించుకోవడమే. ఇందుకు యువత, చిన్నారులు, పెద్దలు, యోగాపై ఆసక్తి కనబరుస్తున్నారు. భారతదేశంలో పుట్టిన యోగా నేడు ప్రపంచ దేశాలలో విస్తరించింది. ప్రతిఒక్కరూ వ్యాయామంలో యోగానే ఆదర్శంగా తీసుకుంటున్నారు. ప్రపంచ దేశాలు గుర్తించడంతో ఐక్యరాజ్య సమితి 2015 జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది.

- ఉరుకులు పరుగుల జీవితంలో ముసురుకుంటున్న జబ్బులు
- యోగా సాధనతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం
- రోగ నిరోధక శక్తి పెంపు
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

యోగా ఎంతో మేలు

యోగా సాధనతో శారీరక సామర్థ్యం పెరుగుతుంది. శరీరాకృతిని మెరుగుపరుస్తుంది. బరువు తగ్గడానికి, గుండె బలోపేతం కావడానికి, జీవన కాలం, ఆత్మ విశ్వాసం పెరగడానికి దోహదపడుతుంది. రోజుకు కనీసం 30 నిమిషాల పాటు యోగా చేస్తే చాలావరకు జబ్బుల నుంచి దూరంగా ఉండవచ్చని యోగా నిపుణులు సూచిస్తున్నారు.

రాష్ట్రస్థాయిలో రాణించి



2022లో తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్ లెవల్ జడ్జెస్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో ఏ గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించా. డ్రీమ్ యోగా సెంటర్ ఆధ్వర్యంలో 2019లో నిర్వహించిన నాలుగు జిల్లాల స్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించా. 2020లో డ్రీమ్ యోగా సెంటర్ నేషనల్ లెవల్ ఆన్‌లైన్ యోగాసన చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని ద్వితీయస్థానంలో నిలిచా. 2021లో జిల్లాస్థాయి పోటీల్లో, నేషనల్ లెవల్ పోటీల్లో పాల్గొని ప్రథమస్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్స్ సాధించా.

– లెక్కల హారిక, మంచిర్యాల

యోగాతోనే ఆరోగ్యం



యోగాతో ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరవు. వ్యాధులను పూర్తిగా అదుపులో ఉంచేందుకు యోగా దోహదపడుతుంది. ధ్యానం, ప్రాణాయామం వంటి ఆసనాలు ఒత్తిడిని దూరం చేయడంతో పాటు, రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. కరోనా వంటి వైరస్‌ల ముప్పు నుంచి కాపాడుతాయి. చిన్నారుల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను పెంపొందిస్తాయి.

– డాక్టర్ సమీర, మైత్రి యోగా శిక్షకురాలు, మంచిర్యాల

యోగాలో ప్రతిభ



2018లో యోగా ఇన్‌స్ట్రక్టర్ కోర్సును పూర్తి చేశా. 2019లో మైత్రి యోగా నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ద్వితీయస్థానంలో, డ్రీమ్ యోగా సెంటర్ ఆధ్వర్యంలో మందమర్రిలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో, సప్తరిషి యోగా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో గెలుపొందా.

– సామల మౌనిక, మంచిర్యాల

20 ఏళ్లుగా శిక్షణ ఇస్తున్నా..



శ్రీరాంపూర్: యోగా జీవితంలో ఒక భాగం కావాలి. సింగరేణి కార్మికులు, కుటుంబ సభ్యులకు 20 ఏళ్లుగా ఉచితంగా యోగాలో శిక్షణ ఇస్తున్నా. కేవలం సేవా దృక్పథంతో డ్యూటీ విరామ సమయలో ఉదయం, సాయంత్రం వేళల్లో యోగా నేర్పిస్తున్నా. ఇప్పటి వరకు సుమారు వెయ్యి మందికి యోగా శిక్షణ ఇచ్చా. ఆర్కే 6 గనిలో డెప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేసి ఇటీవలే రిటైరయ్యా. – కే.బక్కయ్య

శారీరక, మానసిక శుద్ధి చేస్తుంది



శ్రీరాంపూర్: కంపెనీ ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణ ద్వారానే యోగా నేర్చుకున్నా. ఆతర్వాత కోర్సులు పూర్తిచేసి కంపనీలోనే క్లాసులు నిర్వహిస్తున్నా. నేయోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా కూడా శుద్ధి చేస్తుంది. సెల్ఫ్ కాన్ఫిడెన్స్ పెంచుతుంది. నిత్యం ఇంటి వద్ద యోగా చేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక జబ్బులను అదుపులో ఉంచుతుంది. నరాల జబ్బులు, కీళ్లనొప్పులు, బరువు తగ్గడం వంటి వాటికి యోగా చక్కగా ఉపయోగపడుతుంది. – సీహెచ్ శిరీష

ఆసనాల్లో అద్భుత ప్రతిభ



శీర్షాసనం



ప్రశంస పత్రం, మెమొంటోతో దినేష్

కెరమెరి(ఆసిఫాబాద్): మండల కేంద్రానికి చెందిన లక్ష్మణ్ పురి, సునందా దంపతుల కుమారుడైన దినేష్ పురి బెంగళూరులోని ఎస్‌వ్యాస యూనివర్సిటీలో యోగాలో శిక్షణ పొందాడు. పాశ్వబకాసన, మరిచయాసన, చక్రసనా, జానుశీర్షాసన, మత్యాసన, గోరఖశాసన, సర్వాంగాసన, హలాసనా, కర్ణపీడాసన, కుక్కుటాసన, వృశ్చికాసన, ఉత్కటాసన, ఏకపాదబకాసన, సటరాజసన, వీరబద్రాసనా, శీర్శాసన, గర్భపీడాసన, పశ్చిమొత్తానాసన, తదితర, ఆసనాలు సునాయాసంగా వేయగలడు. 2019లో సిద్దిపేటలో నిర్వహించిన 6వ తెలంగాణ స్టేట్ లెవల్ యోగా చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని ప్రశంసపత్రం అందుకున్నాడు. అదే సంవత్సరంలో బెంగళూరులో నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ప్రశంసపత్రం అందుకున్నాడు.

యోగాకు మారుపేరు 'రోటిగూడ'

జన్నారం (ఖానాపూర్): మండలంలోని రోటిగూడకు ఓ ప్రత్యేకత ఉంది. ఆ గ్రామంలోని గీతామాత ఆలయంలో శ్రీహరి మౌనస్వామి యోగా, ధ్యానం చేస్తూ ఆధ్యాత్మికత పెంపొందిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు శివనూరి తిరుపతి ఆధ్వర్యంలో ఆరేళ్లుగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఉచితంగా యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. సుమారు 40 మంది విద్యార్థులు యోగాలో శిక్షణ పొందుతున్నారు. ఇందుకు గ్రామస్తులు ఉచితంగా మ్యాట్‌లు పంపిణీ చేశారు.

జాతీయస్థాయిలో రాణింపు

2020 మే 20 న ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా ప్రదర్శనలో రోటిగూడకు చెందిన 8 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రశంస పత్రాలు అందుకున్నారు. 2018లో మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొన్న గ్రామానికి చెందిన విద్యార్థులు శివనూరి హృషికేశ్, హర్మిత్ సాయి బంగారు పతకాలు సాధించారు. 2022 జూన్‌లో ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీలలో శివనూరి హృషికేశ్, పాదం బాలాజీ, హర్మిత్‌సాయి, దేవరకొండ సురేశ్ ప్రశంస పత్రాలు అందుకున్నారు. మంచిర్యాలలో జరిగిన తెలంగాణ ఉత్సవాల్లో భాగంగా కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా హృషికేశ్ ప్రశంస పత్రం అందుకున్నారు.



ప్రశంసపత్రం అందుకుంటున్న హృషికేశ్(ఫైల్)

శిక్షణ కొనసాగిస్తా..



గ్రామంలోని విద్యార్థులు యోగాలో శిక్షణ పొందడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా యోగా శిక్షణ తరగతులకు హాజరవుతున్నారు. వారిలో ఉన్న ఆసక్తి వల్లే జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు తీసుకెళ్తున్నా. మారుమూల గ్రామానికి చెందిన విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించడం ఆనందంగా ఉంది. శిక్షణ ఇలాగే కొనసాగిస్తా. – శివనూరి తిరుపతి, వ్యాయామ ఉపాధ్యాయుడు

ప్రమాదవశాత్తు కాలువలోపడి వ్యాపారి మృతి



గోవింద్‌రెడ్డి(ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యాపారి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన చిడిపూడి గోవింద్‌రెడ్డి (46) ఎరువులు, విత్తనాల వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం ఉదయం వసూళ్ల కోసం బైక్‌పై కెరమెరి మండలంలోని నిషాని గ్రామానికి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్‌చేయగా ఇందాని సమీపంలో ఉన్నట్లు తెలిపాడు. అనంతరం వాంకిడికి చెందిన ఓ వ్యాపారికి ఫోన్‌చేసి డబ్బులు వసూలయ్యేలా లేవని, అప్పులు తీర్చడం కష్టంగా మారిందని వాపోయాడు. అతని మాటలతో అనుమానం రావడంతో స్థానికులు ఇందాని సమీపంలోని కుమురంభీం ప్రధాన ఎడమ కాలువ మీదుగా వెతుక్కుంటూ వెళ్తుండగా కాలువ పక్కన బైక్, చెప్పులు వదిలి ఉండటాన్ని గమనించి కాలువలో గాలించగా మృతదేహం లభ్యమైంది. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించారు. బహిర్భూమికి వెళ్లి కాలుజారి కాలువలో పడడంతో ఈతరాక మృతి చెందాడని మృతుని భార్య వాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'పునరావాసం కల్పించకుంటే ఓసీని అడ్డుకుంటాం'



మాట్లాడుతున్న దుబ్బగూడెం యువకులు

కాసిపేట(బెల్లంపల్లి): మందమర్రి ఏరియా కళ్యాణి ఖని ఓసీపీ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పించకుంటే ఓపెన్‌కాస్టు ప్రాజెక్టును అడ్డుకుంటామని దుబ్బగూడెం యువకులు హెచ్చరించారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఓపెన్‌కాస్టు బ్లాస్టింగ్‌లతో గతేడాది వర్షాకాలంలో సుమారు 20 ఇళ్ల వరకు కూలిపోయాయన్నారు. గతంలో గ్రామస్తులతో కలిసి ఓపెన్‌కాస్టు పనులను అడ్డుకునేందుకు సిద్ధంకాగా నెలరోజుల్లో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లింపు, పునరావాసం కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చి పట్టించుకోవడం మరిచారన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువకుల ప్యాకేజీ వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఓరం కవిరాజ్, మహేష్, సురేష్, ప్రసన్న, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'విచారణ పేరుతో జాప్యం సరికాదు'



మాట్లాడుతున్న అబ్దుల్ ఖాదిర్

శ్రీరాంపూర్(మంచిర్యాల): విచారణ పేరుతో సింగరేణి యజమాన్యం జాప్యం చేయడం సరికాదని కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంవోఏఐ) ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం శ్రీరాంపూర్‌లోని ఇల్లందు క్లబ్‌లో బెల్లంపల్లి, రామగుండం రీజియన్ల పరిధిలోని ప్రతినిధుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. తమ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా సీఎంవోఏఐ శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదిర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఓసీపీలో ఎలాంటి సంబంధం లేని 32 మంది అధికారులకు చార్జిషీట్లు ఇచ్చి ఎలాంటి చర్యలు లేకుండా నాలుగేళ్లుగా ఎంక్వయిరీల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. దీంతో ఎలాంటి తప్పుచేయని అధికారులు తప్పుడు చార్జిషీట్ల కారణంగా శిక్ష అనుభవిస్తున్నారన్నారు. వెంటనే దీనిపై యజమాన్యం స్పందించి చార్జిషీట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏరియా జీఎం సంజీవరెడ్డికి దృష్టికి సమస్యలు తీసుకెళ్లగా ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో ఏరియా జీఎంలు చింతల శ్రీనివాస్(ఆర్జీ 1), మనోహర్(ఆర్జీ 2), అపెక్స్ కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు ఏవీ రెడ్డి, నాయకులు చిలక శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ చంద్రమౌళి రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీ విస్తరణతో నిరుద్యోగులకు ఉపాధి

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాల్క సుమన్

జైపూర్(చెన్నూర్): సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంటు విస్తరణలో భాగంగా మరో 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని, ఎస్టీపీపీ ప్రభావిత 9 గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తెలిపారు. జైపూర్ మండలం ఎల్కంటి, వేలాల, పౌనూర్ గ్రామాల్లో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్ ప్లాంటు విస్తర్ణతో సుమారు 400 నుంచి 500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం కుందారంలో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. జెడ్పీటీసీ మేడి సునీత, పంచాయతీరాజ్ డీఈ స్వామిరెడ్డి, తహశీల్దార్ మోహన్‌రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఐసీడీఎస్ సీడీపీవో మనోరమ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బల్మూరి అరవిందర్‌రావు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు బేతు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.